సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024



చేపల వేటకు వెళ్లొద్దు

ఎస్సారెస్పీకి భారీగా వరద వస్తుండటంతో బ్యాక్ వాటర్‌లో చేపల వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు అధికారులు సూచించారు.

- 8లో ▸



వైఎస్సార్‌కు ఘన నివాళి

ఉమ్మడి ఏపీ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా జిల్లాలో ఘనంగా నివాళి అర్పించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
28.9 /20.3

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నిజాంసాగర్‌ను సందర్శించిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: నిజాంసాగర్ ప్రాజెక్ట్‌ను సోమవారం మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సందర్శించారు. ఎగువ నుంచి వరద నీరు ఎక్కువగా వస్తోందని, మంగళవారం సాయంత్రానికి జలాశయం పూర్తిగా నిండే అవకాశముందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం శ్రీరాంసాగర్ జలాశయాన్ని సందర్శించి అధికారులతో సమీక్ష చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం రాత్రికి ఎస్సారెస్పీలోకి 4 లక్షల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశముందని, దీంతో అవుట్ ఫ్లో మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాజెక్ట్ దిగువన ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నిజాంసాగర్‌లోకి భారీ వరద

నిజాంసాగర్‌: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. సోమవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో 53,100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. మెదక్ జిల్లాలోని ఘనపురం ఆనకట్ట, హల్దీ వాగులతోపాటు పోచారం ప్రాజెక్టు అలుగుపైనుంచి పారుతున్న వరద వస్తోందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా 1,398.58 అడుగుల(9.896 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని తెలిపారు.

ఎస్సారెస్పీని సందర్శించిన కలెక్టర్, సీపీ



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను సోమవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ సందర్శించారు. ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలను తెలుసుకున్నారు. బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతాల్లో పంటలు నీట మునగకుండ నీటి విడుదల చేపట్టాలని సూచించారు. గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణి, ఏఈఈ వంశీ ఉన్నారు. అలాగే నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల సోమవారం ప్రాజెక్ట్‌ను సందర్శించారు. నీటి విడుదలపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

నిజామాబాద్ అర్బన్‌: వర్షాల నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు మంగళవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థలు ఈ ఆదేశాలను పాటించాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కల్గకుండా సెలవు ప్రకటించామని పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సుభాష్‌నగర్‌: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి సూచించారు. ఈమేరకు నిజామాబాద్, జగిత్యాల జిల్లాల కలెక్టర్లకు ఆయన సోమవారం లేఖ రాశారు. మరో రెండు, మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడ కూడా ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ 40 గేట్లు తెరిచారని, మత్స్యకారులు, జాలర్లను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని విజ్ఞప్తిచేశారు. ఎక్కడైనా ఇబ్బందులుంటే బీజేపీ శ్రేణులు సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆయన సూచించారు.

ఖోఖో పోటీలు వాయిదా

కామారెడ్డి అర్బన్‌: పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించాల్సిన ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల ఖోఖో పోటీలు వాయిదా పడ్డాయి. భారీ వర్షాల కారణంగా పోటీలను ఈనెల 9వ తేదీకి వాయిదా వేసినట్లు ఖోఖో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమారెడ్డి, అతీకుల్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 85559 96271, 73965 41233, 96762 69988 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



చీమన్‌పల్లిలో నేలకొరిగిన మొక్కజొన్న పంట



అలుగు పారుతున్న రామడుగు ప్రాజెక్ట్



గడ్డమీది తండా వద్ద కోతకు గురైన రోడ్డు

వాన.. విధ్వంసం

- పారిన అలుగులు.. ఉప్పొంగిన వాగులు
- తెగిన రోడ్లు.. కూలిన ఇండ్లు
- పొలాల్లో చేరిన వరద నీరు
- నిండుగా ప్రవహిస్తున్న గోదావరి, మంజీర నదులు
- 73 టీఎంసీల నీటిమట్టానికి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

నిండుగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు





ప్రాజెక్టు నుంచి 41 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: వరుసగా రెండోరోజు ఆగకుండా కురుస్తున్న వర్షం జిల్లాలో జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. పలు చోట్ల చెరువులు నిండి అలుగులు పారి వాగులు పొంగుతున్నాయి. పలుచోట్ల గ్రామాలకు రాపోకలు నిలిచిపోయాయి. అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ చేస్తోంది. గోదావరి, మంజీర నదులు పరవళ్లు తొక్కుతున్నాయి.

■ శ్రీరాంసాగర్ జలాశయంలోకి ఎగువ నుంచి వరద పోటెత్తుతోంది. దీంతో 41 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ఇన్‌ఫ్లో 2.51 లక్షల క్యూసెక్కులు ఉండగా అవుట్ ఫ్లో 3.15 లక్షలు ఉంది. ఆదివారం రాత్రి నుంచే జలాశయంలోకి వరద పోటెత్తుతోంది. మొదట 41 వేల క్యూసెక్కులతో వరద మొదలైంది. సోమవారం ఉదయం 9 గంటలకు ఇన్‌ఫ్లో 1.96 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. సాయంత్రం 4 గంటలకు 2 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. రాత్రి 9 గంటలకు 2.51 లక్షల ఇన్‌ఫ్లో ఉండడంతో 3.15 లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. ఎస్సారెస్పీ పూర్తి స్థాయి నీటి మట్టం 1,091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 1,088.9 అడుగులు (72.990 టీఎంసీలు) నీటి నిల్వ ఉంది. వరద కాలువ ద్వారా 7 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 5 వేల క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 622 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు వెళుతోంది.

■ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ సింగనవార్ శ్రీరాంసాగర్ జలాశయాన్ని పరిశీలించారు. మంగళవారం విద్యాసంస్థలకు సెలవు ఇస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.

■ జిల్లాలో మొత్తం 1,086 చెరువులకు గాను 721 చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. 299 చెరువుల్లోకి 75–100 శాతం మధ్య నీరు చేరింది. 66 చెరువుల్లోకి 75 శాతం లోపు నీరు వచ్చింది.

■ బాల్కొండ నియోజకవర్గంలో పలుచోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. పెద్దవాగు ప్రవాహం, గోదావరి పరవళ్లతో తడపాకల్ వద్ద నీటి ఉధృతి భారీగా ఉంది. రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు విభాగాలు అప్రమత్తమై ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.

■ బోధన్ నియోజకవర్గంలోని గోదావరి, మంజీర నదులకు భారీ వరద వస్తోంది. రెంజల్ మండలం కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రం వద్ద గోదావరికి వరద పోటెత్తింది. కందకుర్తి, సాలుర వద్ద మహారాష్ట్ర వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిని మూసేశారు. అధికారులు వరద పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారు. సాలూర గ్రామ శివారులోని మంజీర నదికి భారీగా వరద నీరు చేరింది. ఎడపల్లి మండలంలోని అలీసాగర్ రిజర్వాయర్ ఒక గేటు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.

■ నిజామాబాద్ రూరల్ నియోజవర్గంలో అన్ని మండలాల్లో చెరువులు అలుగులు పోస్తున్నాయి. ఇందల్వాయి మండలం గౌరారం గ్రామంలో పాత ఇల్లు కూలింది. ఎలాంటి నష్టం వాటిల్లలేదు. రామడుగు ప్రాజెక్టు అలుగు పారడంతో అదనపు కలెక్టర్ సందర్శించారు. సిరికొండ మండలం కప్పల వాగు ఉధృతంగా పారడంతో కొంతమేర పంటలు నీట మునిగాయి. డిచ్‌పల్లి, ఇందల్వాయి, మోపాల్, నిజామాబాద్ రూరల్, మండలాల్లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. నిజామాబాద్ నగరంలో సైతం సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి.

■ ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆర్మూర్ మున్సిపాలిటీతో పాటు ఆర్మూర్, నందిపేట్, మాక్లూర్, ఆలూర్, డొంకేశ్వర్ మండలాల్లో పంటలు నీట మునిగాయి. ఆర్మూర్ పట్టణంలోని 63వ నంబర్ జాతీయ రహదారితో పాటు ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



బోధన్ మండలం హంగర్గాలో ముంపు పరిస్థితిని తెలుసుకుంటున్న అధికారులు



తెగిపోయిన కోనసముందర్ - అమీర్‌నగర్ రోడ్డు

కందకుర్తి వద్ద గోదావరి ఉధృతం



అంతర్రాష్ట్ర వంతెనను ఆనుకొని ప్రవహిస్తున్న గోదావరి

రెంజల్‌: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. మహారాష్ట్రలోని విష్ణుపురి, గైక్వాడ్ ప్రాజెక్టుల గేట్లు ఎత్తడంతో కందకుర్తి వద్ద గోదావరి నది పరవళ్లు తొక్కుతోంది. 12 గంటల వ్యవధిలోనే గోదావరిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు తిలకించడానికి వస్తున్నారు. నది పరీవాహక గ్రామాల ప్రజలను పోలీసులు అప్రమత్తం చేయించారు. నది వద్దకు జాలార్లు, గొర్రెలు, మేకలు, గేదెల కాపర్లు వెళ్లొద్దని దండోరా వేయించారు.

మంజీరకు భారీ వరద



సాలూర శివారులో పాత వంతెనను తాకుతూ ప్రవహిస్తున్న మంజీర

బోధన్‌: సాలూర శివారులో గల మంజీర నదికి సోమవారం భారీగా వరద పొటెత్తింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో నదికి ఉదయం నుంచి వరద నీరు పెరుగుతూ వచ్చింది. సాలూర తహసీల్దార్ రమేశ్, పోలీసులు, మహారాష్ట్ర పోలీసులు మంజీర నదిని సందర్శించి వరద పరిస్థితిని పరిశీలించారు. నది తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ఈత కొట్టుకుంటూ..

సిరికొండ: మండలంలోని కొండూర్ వద్ద వంతెనపై నుంచి వాగు ప్రవహిస్తోంది. గ్రామానికి చెందిన మినుకురు నారాయణ బైక్‌పై వాగు దాటే ప్రయత్నం చేయగా వరద ఉధృతికి బైక్‌తో సహా పడిపోయాడు. నారాయణ ఈత కొట్టుకుంటూ ఒడ్డుకు చేరాడు. బైక్ వాగులో కొట్టుకుపోయింది.

జిల్లాలో సోమవారం నమోదైన వర్షపాతం వివరాలు

మండలం	ప్రాంతం	నమోదైన వర్షపాతం మి.మీటర్లు						
నిజామాబాద్‌రూరల్	పాల్దా	39.8	ఎడపల్లి	ఎడపల్లి	15.5	బోధన్	కల్దుర్కి	6.0
ముప్కాల్	ముప్కాల్	29.0	ఆలూర్	మచ్చర్ల	13.0	ఇందల్వాయి	గన్నారం	5.8
నవీపేట్	నవీపేట్	26.3	చందూర్	చందూర్	12.0	పోతంగల్	పోతంగల్	5.5
ఎడపల్లి	జాన్కంపేట్	23.8	ధర్పల్లి	ధర్పల్లి	11.8	రెంజల్	రెంజల్	5.5
నిజామాబాద్‌సౌత్	నిజామాబాద్	22.8	బోధన్	బెల్లాల్	10.8	డిచ్‌పల్లి	డిచ్‌పల్లి	5.0
బాల్కొండ	బాల్కొండ	21.5	ఆర్మూర్	పెర్కిట్	10.8	జక్రాన్‌పల్లి	జక్రాన్‌పల్లి	4.8
నిజామాబాద్‌నార్త్	నిజామాబాద్‌నార్త్	20.8	వేల్పూర్	వేల్పూర్	10.0	బోధన్	చిన్నమావంది	4.8
నిజామాబాద్‌నార్త్	గూపన్‌పల్లి	20.5	మాక్లూర్	లక్మాపూర్	9.8	సిరికొండ	సిరికొండ	4.5
ఆర్మూర్	మగ్గిడి	19.5	కోటగిరి	కోటగిరి	6.8	సిరికొండ	తూంపల్లి	4.5
మోర్తాడ్	మోర్తాడ్	15.8	భీమ్‌గల్	భీమ్‌గల్	6.8	నిజామాబాద్‌రూరల్	మల్కాపూర్	4.3
			రుద్రూర్	రుద్రూర్	6.5	వర్ని	జాకోరా	4.3



తాటిపల్లిలో వరి పొలంలో వేసిన ఇసుక మేటలు

26 మందికి పునరావాసం

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలో నాలుగు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయగా 26 మందిని తరలించారు. 19 రోడ్లు తెగిపోయాయి. ఇందులో ఆర్‌అండ్‌బీకి చెందిన 13 రోడ్లు, పంచాయతీరాజ్‌కు చెందిన ఆరు రోడ్లు ఉన్నాయి. జిల్లా కలెక్టరేట్‌లోని రెండవ అంతస్తులో 217 గది వద్ద పీవోపీ ఊడి కింద పడిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.



జక్రాన్‌పల్లి మండలం బాలనగర్ పునరావాస కేంద్రంలో భోజనం చేస్తున్న బాధితులు

రెండు రాష్ట్రాల మధ్య రాకపోకల నిలిపివేత

రెంజల్‌: గోదావరికి వరద ఉధృతి పెరగడంతో తెలంగాణ, మహారాష్ట్రలను కలిపే వంతెనను ఆనుకొని నీరు ప్రవహిస్తోంది. దీంతో అధికారులు వంతెన మీదుగా రాకపోకలు నిలిపివేశారు. బోధన్ రూరల్ సీఐ నరేష్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎస్సై సాయన్న, ఎంపీడీవో శ్రీనివాస్ వంతెన వద్దకు చేరుకొని పరిశీలించారు. రోడ్డుకు అడ్డుగా బారికేడ్లు ఏర్పాటు చేయించారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్ అధికారులతో మాట్లాడి పరిస్థితిని వివరించారు. దీంతో అక్కడి పోలీసులు కూడా రోడ్డును మూసివేశారు.



కందకుర్తి వద్ద అంతర్రాష్ట్ర రహదారిపై రాకపోకలను నిలిపి వేసిన అధికారులు

ఇందూర్‌కు రూ.438 కోట్ల 'అమృత్' నిధులు

- మంచినీటి కోసం రూ. 270 కోట్లు..
- అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కోసం రూ.168 కోట్లు
- పనులపై సచివాలయంలో సమీక్షించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్



సచివాలయంలో సమీక్షిస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్

ఖలీల్‌వాడి: అమృత్ పథకం కింద నిజామాబాద్ నగర అభివృద్ధికి రూ.438 కోట్ల నిధులు కేటాయించారు. దీనిపై సోమవారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ సమీక్ష నిర్వహించారు. అమృత్–2.0 పథకం కింద నగరంలో మంచి నీటి సరఫరా, డ్రెయినేజీ ప్రాజెక్టుల అమలుపై సమీక్ష చేశారు. నగరంలో నీటి సరఫరాకు మోపాల్‌లో 8 ఎంఎల్‌డీ సామర్థ్యంతో కొత్త నీటి శుద్ధి ప్లాంట్ (డబ్ల్యూటీపీ) నిర్మాణం చేపట్టాలని చర్చించారు. నగరానికి మంచినీరు అందిస్తున్న అలీసాగర్ వద్ద ఇప్పటికే ఉన్న ప్లాంట్‌ను పునరుద్ధరణ చేయాలని నిర్ణయించారు. నగరంలో శాశ్వతంగా నీటి సరఫరాను చేపట్టడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి పంపిణీ, పర్యవేక్షణను మరింత మెరుగుపరచడానికి 12,394 కొత్త హౌస్ సర్వీస్ కనెక్షన్లు, 146 బల్క్ ఫ్లో మీటర్లు నిర్మించాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నగరంలో మురుగు కాలువలు నిర్మించాలన్నారు. మురుగు ప్రవాహాన్ని, నిర్వహణను సులభతరం చేయడానికి 7,500 తనిఖీ గదుల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ప్రాజెక్ట్‌లో భాగంగా 31.5 ఎంఎల్‌డీ, 15.5 ఎంఎల్‌డీ సామర్థ్యాలతో దుబ్బ, ఎల్లమగుట్టలో ఇప్పటికే ఉన్న మురుగునీటి శుద్ధి కర్మాగారాల నిర్మాణం, నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. నిర్ణీత 24 నెలల వ్యవధిలో అన్ని పనులను పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలోనే కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు ఫోన్ చేసి భూసేకరణ చేయాలని సూచించారు.

ముగ్గురిని కాపాడిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

మోర్తాడ్ (బాల్కొండ): ఏర్గట్ల మండలం తడపాకల్, మెండోరా మండలం సావెల్ మధ్య దీవిలాంటి ప్రదేశంలోని ఆశ్రమంలో వరదలో చిక్కుకున్న ముగ్గురిని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం రక్షించింది. ఎస్సారెస్పీ గేట్లు ఎత్తడంతో గోదావరి నదిలోకి జలాలు ఉప్పొంగి పెద్దవాగు శరవేగంగా పారుతోంది. ఈ క్రమంలో సాంబయ్య ఆశ్రమం పూర్తిగా పెద్దవాగు వరద నీటిలో చిక్కుకు పోయింది. దీంతో ఆశ్రమంలో ఉన్న ముత్తెన్న, నారాయణ, సంతోష్‌లు తమను కాపాడాలని ఆర్తనాదాలు చేశారు. వారితో పాటు ఆశ్రమంలో గుర్రం, ఆవులు ఉన్నాయి. స్థానికులు విషయాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులకు తెలపగా వారు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందానికి సమాచారం ఇచ్చారు. హైదరాబాద్ నుంచి హుటాహుటిన చేరుకున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు చిన్న పడవలో వెళ్లి ముగ్గురిని ఆశ్రమం నుంచి సురక్షితంగా బయటకు తీసుకు వచ్చారు. ఈ ఆపరేషన్‌ను ఆర్మూర్ ఆర్డీవో రాజుగౌడ్, ఏర్గట్ల తహసీల్దార్, ఏసీపీ బస్వారెడ్డి, భీమ్‌గల్ సీఐ నరేశ్ కుమార్, ఏర్గట్ల ఎస్సై రాములు పర్యవేక్షించారు.



ఆశ్రమంలో చిక్కుకున్న వారితో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం, అధికారులు

క్లుప్తంగా

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



నిజామాబాద్‌అర్బన్‌: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 28 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తోపాటు డీడబ్ల్యూవో రసూల్‌ బీ, నిజామాబాద్‌ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు అందజేశారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. వర్షాల కారణంగా ఫిర్యాదులు తక్కువ సంఖ్యలో నమోదయ్యాయి.

సొసైటీలో విచారణ



బాల్కొండ: మెండోరా మండలం సావెల్‌ సొసైటీలో రూ.80 లక్షల గోల్‌మాల్‌ వ్యవహారంపై విచారణ అధికారి సత్యనారాయణరావు సోమవారం విచారణ చేపట్టారు. సీఈవోలు గత పాలకవర్గ హయాంలో రూ.35 లక్షలు, ప్రస్తుత పాలకవర్గం హయాంలో రూ.45లక్షల అవకతవకలకు పాల్పడినట్లు తెలిసింది. డీసీవో శ్రీనివాస్‌ ఈ వ్యవహారంపై విచారణ అధికారిగా సత్యనారాయణరావును నియమించిన విషయం విదితమే. విచారణ ప్రారంభించిన ఆయన సొసైటీ లావాదేవీలకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు. త్వరలోనే పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఆయన వెంట చైర్మన్‌ మచ్చర్ల రాజారెడ్డి, సిబ్బంది తదితరులున్నారు.

జర్నలిస్టుల రక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా బొబ్బిలి నర్సయ్య



నిజామాబాద్‌నాగారం: తెలంగాణ రాష్ట్ర వర్కింగ్‌ జర్నలిస్టు యూనియన్‌ (టీయుడబ్ల్యూజే – ఐజేయూ) అనుబంధంగా పనిచేస్తున్న జర్నలిస్టుల రక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా యూనియన్‌ రాష్ట్ర కౌన్సిల్‌ మెంబర్‌ బొబ్బిలి నర్సయ్య ఎంపికయ్యారు. సీనియర్‌ జర్నలిస్టు, యూనియన్‌ రాష్ట్ర నాయకుడైన బొబ్బిలి నర్సయ్యకు అవకాశం కల్పించడంపై జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంజీవ్‌, కార్యదర్శి అరవింద్‌ బాలాజీ, కోశాధికారి సిరిగాద ప్రసాద్‌, ఆర్గనైజేషన్‌ కార్యదర్శి సంజీవరెడ్డితోపాటు జిల్లా కమిటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బాన్సువాడ రూరల్‌: బీర్కూర్‌ మండల కేంద్రంలో సోమవారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఇద్దరు చిన్నారులు ప్రాణాలతో బయటపడ్డారు. బీర్కూర్‌కు చెందిన బండ సాయిలు, కవిత దంపతులు తమ ఇద్దరు పిల్లలు నమస్వీ(8), కృతిక(2)ను ఇంట్లో పడుకోబెట్టి బయట పనులు చేసుకుంటున్నారు. ఇంతలో వర్షానికి తడిసిన గోడ కొంతభాగం చిన్నారులు పడుకున్న ప్రదేశానికి దగ్గరలో కూలింది. భయపడిన చిన్నారులు ఏడ్చుకుంటూ బయటకు వచ్చారు. వారు బయటకు వచ్చిన కొద్దిసేపటికే మిగతా గోడ భాగం కూలడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎస్సారెస్పీకి పోటెత్తిన వరద

- 41 వరద గేట్లు ఎత్తిన ప్రాజెక్ట్‌ అధికారులు
- గోదావరిలోకి 3.15 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల
- ఎగువ నుంచి 2.51 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పోటెత్తింది. దీంతో అధికారులు 41 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. గోదావరిలోకి నీటి విడుదలను ప్రాజెక్ట్‌ ఎస్‌ఈ శ్రీనివాస్‌ గుప్తా, ఈఈ చక్రపాణి సోమవారం ప్రారంభించారు. ప్రాజెక్ట్‌లోకి లక్ష 96 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరడంతో ముందుగా ఎనిమిది గేట్లను ఎత్తి 25 వేల క్యూసెక్కులను గోదావరిలోకి వదిలారు. ప్రాజెక్ట్‌ బ్యాక్‌ వాటర్‌ నిలిచే ప్రాంతాల్లో పంటలు నీట మునగడంతో 26 గేట్ల ద్వారా లక్ష క్యూసెక్కులు విడుదల చేశారు. ఉన్నతాధికారులు మరింత నీటిని గోదావరిలోకి వదలాలని సూచించడంతో 40 గేట్లను ఎత్తి లక్ష 50 వేల క్యూసెక్కులను దిగువకు వదిలారు. రాత్రి వరకు 41 గేట్లను ఎత్తి 3.15 లక్షల క్యూసెక్కులు పెంచారు.

72 టీఎంసీలకు చేరగానే..

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 80 టీఎంసీలు కాగా ఎగువ నుంచి వరద ఉధృతి ఉండటంతో నిల్వ 72 టీఎంసీలకు చేరగానే గేట్లను ఎత్తారు. బ్యాక్‌ వాటర్‌ నిలిచే ప్రాంతంలో పంటలు నీట మునిగే పరిస్థితి ఎదురు కావడంతో ముందస్తుగానే నీటి విడుదలను చేపడుతున్నారు. కాగా ప్రాజెక్ట్‌లోకి ఆదివారం సాయంత్రం 7 గంటల నుంచి గంట గంటకు వరద నీరు పెరుగుతు వచ్చింది. రాత్రి 7 గంటలకు 41 వేల క్యూసెక్కులు ఉన్న వరద సోమవారం ఉదయం 8 గంటల వరకు లక్ష 62 వేల క్యూసెక్కులకు చేరింది. ఉదయం 9 గంటలకు లక్ష 96 వేల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో పెరిగి సాయంత్రం వరకు నిలకడగా అదే వరద కొనసాగింది. సాయంత్రం 4 గంటలకు 2 లక్షల 4 వేల క్యూసెక్కులకు పెరిగింది. రాత్రి 9 గంటలకు 2,51,250 క్యూసెక్కుల వరద వస్తోంది.



విద్యుత్‌ ఉత్పత్తి చేస్తున్న టర్బయిన్లు

కాలువల ద్వారా..

ప్రాజెక్ట్‌ నుంచి వరద కాలువ ద్వారా ఏడు వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు, ఎస్కేప్‌ గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 622 క్యూసెక్కులు, మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 1088.90(72.99 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

సామర్థ్యానికి మించి విద్యుదుత్పత్తి

ఎస్సారెస్పీ దిగువన గల జల విద్యుత్‌ కేంద్రంలో నాలుగు టర్బైన్‌ల ద్వారా సామర్థ్యానికి మించి ఉత్పత్తి చేపడుతున్నారు. కేంద్రంలోకి నీటి ప్రవాహం వేగంగా రావడంతో సామర్థ్యానికి మించి ఉత్పత్తి జరుగుతోందని అధికారులు తెలిపారు. కేంద్రంలో 36 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉంది. పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేపట్టాలంటే ప్రతి టర్బయిన్‌కు 2,200 క్యూసెక్కుల నీరు అవసరం. కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల ఆధారంగా ఉత్పత్తి జరుగుతుంది. ప్రస్తుతం కాకతీయ కాలువ ద్వారా నీటి అవసరం లేకున్న ఎస్కేప్‌ గేట్ల ద్వారా గోదావరికలోకి మళ్లించి కరెంట్‌ ఉత్పత్తి చేస్తున్నారు. 36.07 మెగావాట్ల విద్యుత్‌ ఉత్పత్తి జరుగుతున్నట్లు జెన్‌కో డీఈఈ శ్రీనివాస్‌ తెలిపారు.



ఆర్మూర్‌ మండలం ఇస్సాపల్లి రోడ్డుపై పడిన చెట్టు



ముప్కాల్‌: ఉధృతంగా ప్రవహిస్తున్న గుండెవాగు



పోచంపల్లి - అంక్సాపూర్‌ మధ్య ముత్యాలవాగు..

పొంగిన వాగులు.. తెగిన రోడ్లు

జిల్లాను వర్షం వీడలేదు. సోమవారం సైతం విస్తృతంగా వర్షాలు కురవడంతో పలు ప్రాంతాల్లో వాగులు ఉధృతంగా ప్రవహించాయి. కొన్ని చోట్ల రోడ్లు కొట్టుకుపోయాయి. రోడ్లపైనుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు అధికారులు రాకపోకలను నిలిపివేశారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. ప్రజలను అప్రమత్తం చేశారు. పంటలు నీట మునిగాయి. ఆర్మూర్‌ మండలం ఇస్సాపల్లి వద్ద రోడ్డుపై చెట్టుపడిపోయింది.

– సాక్షి నెట్‌వర్క్‌



ముప్కాల్‌ మండలంలోని కొత్తపల్లిలో నీట మునిగిన పంటలు



సిరికొండ : కొండూర్‌ వద్ద లో లెవల్‌ వంతెన..



మోపాల్‌: వెంకట్‌రాంనాయక్‌ తండా వద్ద రోడ్డు..



పురాణీపేట్‌లో చెరువు కట్టకు మరమ్మతులు..



వేల్పూర్‌ - రామన్నపేట్‌ మధ్య తెగిపోయిన కల్వర్టు



కొట్టుకుపోయిన మోర్తాడ్‌ ముసలమ్మ చెరువు మినీ వంతెన..

వైఎస్సార్‌కు ఘన నివాళులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఎం రేవంత్‌రెడ్డి, బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సోమవారం నివాళులు అర్పించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌ రెడ్డితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న సీఎం, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

అలీసాగర్‌ గేట్‌ ఎత్తివేత

బోధన్‌: నిజాంసాగర్‌ ప్రాజెక్టు చివరి ఆయకట్టు బ్యాలెన్సింగ్‌ రిజర్వాయర్‌గా ఉన్న ఎడపల్లి మండలంలోని అలీసాగర్‌ రిజర్వాయర్‌లోకి భారీ వరద నీరు చేరింది. ఎఫ్‌ఆర్‌ఎల్‌ కెపాసిటీ 1299.6 కాగా 1296.11 స్థాయికి చేరింది. నీటి పారుదల శాఖ అధికారులు సోమవారం ఒక గేటును ఎత్తి దిగువకు నీటి విడుదల చేశారు. రెండు రోజుల్లో రిజర్వాయర్‌లోకి 950 క్యూసెక్కుల నీరు రాగా, 500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలినట్లు అధికారులు తెలిపారు. వరద భారీగా వస్తున్న నేపథ్యంలో రెండో గేటూ తెరిచే అవకాశం ఉంది.



అలీసాగర్‌ రిజర్వాయర్‌ నుంచి విడుదలవుతున్న నీరు

అత్యవసరమైతేనే బయటికి రావాలి

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అత్యవసరమైతేనే బయటికి రావాలని ఎస్సై యాదగిరిగౌడ్‌ సూచించారు. ఈ మేరకు సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఎస్సై ఆధ్వర్యంలో ఆటోల ద్వారా విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రజలు రెండు, మూడు రోజులపాటు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉంటున్న ప్రజలు తమ వివరాలను గ్రామ, మండలస్థాయి అధికారులకు తెలియజేస్తే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి సహాయక చర్యలు చేపడుతారన్నారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లో పొలాల వద్దకు వెళ్లొద్దని, చిన్నపిల్లలను పని నిమిత్తం బయటికి పంపొద్దని పేర్కొన్నారు. విద్యుత్‌ స్తంభాలను తాకొద్దని, నాలాలు, మ్యాన్‌హోల్స్‌ పరిసర ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాలని, చెరువులు, వాగుల వద్దకు వెళ్లొద్దని సూచించారు. వర్షాల కారణంగా ఏమైనా ఇబ్బందులు ఎదురైతే 87126 59850 (ఎస్సై, మోపాల్‌) నంబర్‌కు సమాచారమివ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఎస్సై రమేశ్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



కంజర్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఎస్సారెస్పీలో చేపల వేటకు వెళ్లొద్దు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎస్సారెస్పీ బ్యాక్‌ వాటర్‌లో చేపల వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు అధికారులు సూచించారు. డొంకేశ్వర్‌ మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన మత్స్యకారులతో మండల ప్రత్యేకాధికారి జగన్నాథచారి, తహసీల్దార్‌ వెంకటరమణ, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు సోమవారం సమావేశమయ్యారు. ఎగువ నుంచి ఎస్సారెస్పీలోకి భారీగా వరదనీరు వస్తోందని, చుట్టు పక్కల గ్రామాల మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ సూచనలను కాదని చేపలవేటకు వెళితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌ పెరుగుతున్న దృష్ట్యా ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీవో లక్ష్మీప్రసాద్‌, పంచాయతీ కార్యదర్శి శేఖర్‌గౌడ్‌ తదితరులున్నారు.



మత్స్యకారులతో సమావేశమైన అధికారులు

సబ్‌ స్టేషన్‌ తనిఖీ

సిరికొండ: మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ను టీఎస్‌ఎన్‌పీడీసీఎల్‌ వరంగల్‌ సీజీఎం అశోక్‌కుమార్‌ సోమవారం తనిఖీ చేశారు. భారీ వర్షం కురిసినపుడు సమీపంలోని చెరువు నీరు సబ్‌ స్టేషన్‌లోకి వస్తోందని స్థానిక అధికారులు, వీడీసీ సభ్యులు సీజీఎంతో తెలిపారు. రిటైనింగ్‌ వాల్‌, యార్డు నిర్మాణంపై సంబంధిత అధికారులతో సీజీఎం మాట్లాడారు. సబ్‌ స్టేషన్‌ను సందర్శించి ఏఏ పనులు చేపట్టాలి అనే నివేదికలు రూపొందించాలని సివిల్‌ విభాగానికి చెందిన అధికారులను ఆయన ఆదేశించారు. వరదతో ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపడుతామన్నారు. ఆయన వెంట డీఈ ఉత్తమ్‌ జాడే, ఏడీఈ శ్రీనివాస్‌, ఏఈ చంద్రశేఖర్‌, వీడీసీ చైర్మన్‌ జలంధర్‌, సభ్యులు, సిబ్బంది ఉన్నారు.



విద్యుత్‌ అధికారులతో సీజీఎం అశోక్‌కుమార్‌

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌ అర్బన్‌: గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయనున్న నేపథ్యంలో అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్‌ రామ్మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 5వ తేదీలోగా దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని సూచించారు. 6న ఉదయం 10 గంటలకు డెమో, ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తెలుగు, బిజినెస్‌ అనాలసిస్‌, టాక్సేషన్‌, కామర్స్‌, ఫైనాన్స్‌, ఎకనామిక్స్‌, ఫిజిక్స్‌, జువాలజీ, మ్యాథమెటిక్స్‌, స్టాటిస్టిక్స్‌, ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ అలాగే డిచ్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్‌, మ్యాథమెటిక్స్‌ సబ్జెక్టులు బోధించేందుకు దరఖాస్తులను కోరుతున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఆయా సబ్జెక్టుల్లో 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులు సాధించి ఉండాలని, నెట్‌, సెట్‌, పీహెచ్‌డీ, బోధనానుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూ, డెమోకు హాజరయ్యే అభ్యర్థులు తమ వెంట ఒరిజినల్‌ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు.

క్రైం కార్నర్‌

చోరీ కేసులో రిమాండ్‌

బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలోని పాన్‌ దుకాణంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వీరయ్య తెలిపారు. రాజేందర్‌సింగ్‌ అనే వ్యక్తి పట్టణంలోని ఓ పాన్‌ దుకాణం తాళాన్ని శుక్రవారం అర్ధరాత్రి పగులగొట్టి సిగరెట్‌ ప్యాకెట్లు, రూ.4 వేల నగదు ఎత్తుకెళ్లాడన్నారు. దుకాణం యజమాని ఆరిఫ్‌ ఫిర్యాదు మేరకు అనుమానితుడైన రాజేందర్‌సింగ్‌ను విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఎల్లమ్మగుట్టలో వ్యభిచార గృహంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ఇద్దరు విటులతోపాటు ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు. వ్యభిచార గృహం నిర్వాహకురాలిపై కేసు నమోదు చేయడంతోపాటు నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కార్పొరేటర్‌పై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని మూడోటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని గౌతమ్‌నగర్‌కి చెందిన కార్పొరేటర్‌ శివచరణ్‌పై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. సురేశ్‌ అనే వ్యక్తి తన ఇంటి ముందు నుంచి వెళ్తుండగా.. నా ఇంటి ముందు నుంచే వెళ్తావా అంటూ శివచరణ్‌ తన తమ్ముడు ప్రమోద్‌తో కలిసి తనపై దాడి చేశాడన్నారు. గాయాలపాలైన సురేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చైన్‌ సిస్టం బిజినెస్‌లో ఎక్సైజ్‌ కానిస్టేబుల్‌

ఖలీల్‌వాడి: జిల్లా ఎక్సైజ్‌ శాఖలోని ఓ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న హెడ్‌కానిస్టేబుల్‌ చైన్‌ సిస్టం వ్యాపారం నిర్వహిస్తున్నారు. రూ.13వేలు చెల్లించి సభ్యత్వం తీసుకునే వారు మరో ముగ్గురిని సభ్యులుగా చేర్చాల్సి ఉంటుంది. సభ్యులను చేరిస్తే రూ.4వేల చెక్కుతోపాటు ఓ కంపెనీకి చెందిన దుస్తులు అందిస్తారు. అయితే, హెడ్‌ కానిస్టేబుల్‌ ద్వారా చైన్‌ సిస్టంలో చేరిన వారికి సభ్యత్వం రాకపోవడంతో వారు ఆయన ఇంటికి వెళ్లి గొడవ చేయగా వ్యవహారం బయటపడింది. యూ బిట్‌ కాయిన్‌లో ఎక్సైజ్‌ ఎస్సై గంగాధర్‌ అరెస్టైన ఘటన మరువకముందే మరో ఘటన ఎక్సైజ్‌ శాఖలో కలకలం రేపుతోంది.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ) : పిడుగుపాటు కారణంగా తీవ్రగాయాలపాలైన మండలంలోని బొప్పాస్‌పల్లి గ్రామానికి చెందిన కిమ్యానాయక్‌(65) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పశువుల కాస్తున్న సమయంలో శనివారం పిడుగు పడడంతో కిమ్యా తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు ఆయనను బాన్సువాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.



కిమ్యానాయక్‌ (ఫైల్‌)

పురుగుల మందు సేవించిన వ్యక్తి..

బాన్సువాడ రూరల్‌: మండలంలోని రాజారాం దుబ్బ కాలనీకి చెందిన సాదుల దుర్గయ్య(28) గత నెల ఆగస్టు 31న పురుగుల మందు సేవించగా కుటుంబ సభ్యులు బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. కడుపునొప్పి తాళలేక దుర్గయ్య పురుగుల మందుతాగాడని, తమకు ఎవరిపై ఎలాంటి అనుమానాలు లేవని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు.

టీవీ సిగ్నల్‌ కోసం ఫిర్యాదు చేస్తే అకౌంట్‌ నుంచి రూ.49,580 మాయం

- సైబర్‌ నేరగాళ్ల ఉచ్చుకు చిక్కిన తాడ్‌బిలోలి వాసి

రెంజల్‌(బోధన్‌): టీవీ సిగ్నల్‌ రాకపోవడంతో ఫిర్యాదు చేసేందుకు టోల్‌ ఫ్రీ నంబర్‌కు కాల్‌ చేసిన వ్యక్తి అకౌంట్‌ నుంచి సైబర్‌నేరగాళ్లు రూ.49,580 కాజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని తాడ్‌బిలోలికి చెందిన ధనుంజయ్‌రెడ్డి గత నెల 25వ తేదీన రూ.300తో ఎయిర్‌టెల్‌ డీటీహెచ్‌ రీచార్జి చేసుకున్నాడు. సోమవారం సిగ్నల్‌రాకపోవడంతో టోల్‌ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాడు. అవతల వ్యక్తి మాట్లాడుతూ ధనుంజయ్‌రెడ్డికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరించాడు. కొద్దిసేపటికే ధనుంజయ్‌రెడ్డి సెల్‌ఫోన్‌కు రూ.49,580 విత్‌ డ్రా అయినట్లు మెస్సేజ్‌ వచ్చింది. సుమారు రెండు గంటల తరువాత బాధితుడు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నగల దుకాణంలో చోరీ



దుండగులు చోరీకి పాల్పడిన దుకాణం

నందిపేట్‌ (ఆర్మూర్‌): మండల కేంద్రంలోని బంగారు దుకాణంలో ఆదివారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రాములు అండ్‌ సన్స్‌కు చెందిన బంగారం దుకాణం షట్టర్‌ను ఇనుప రాడ్డుతో తెరిచి లోపలికి ప్రవేశించిన దుండగులు లాకర్‌ను తెరిచి అందులోని 6 తులాల బంగారం, కిలో వెండి, రూ.35వేల నగదును ఎత్తుకెళ్లారు. అనంతరం ఎదురుగా ఉన్న దేవీ జుయెల్లరీ షట్టర్‌ను పగులగొట్టేందుకు యత్నించి విఫలమయ్యారు. ఇద్దరు దుండగులు చోరీకి పాల్పడినట్లు సీసీ ఫుటేజీలో రికార్డయ్యింది. బాధితుడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

మోపాల్‌: కుటుంబ కలహాల కారణంగా మండలంలోని కులాస్‌పూర్‌ గ్రామానికి చెందిన సువర్ణ (35) సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపారు. సువర్ణకు ఆమె భర్త రాజుతో కొంత కాలంగా గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురైన ఆయన ఇంట్లోనే ఉరేసుకుందని తెలిపారు. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. సువర్ణ, రాజు దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధురాలు..

నవీపేట: అనారోగ్యంతో బాధపడుతూ మండలంలోని అభంగపట్నం గ్రామానికి చెందిన బక్క సాయమ్మ(65) అనే వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వినయ్‌ సోమవారం తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న సాయమ్మ ఈనెల 1న ఇంట్లోనుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదన్నారు. సోమవారం ఉదయం చెరువులో మృతదేహం లభ్యమైందని తెలిపారు. మృతురాలి కుమార్తె స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చీటీ నిర్వాహకురాలి ఇంటిపై దాడి

- డయల్‌ 100కు ఫిర్యాదు చేసిన బాధితులు
- నిజామాబాద్‌ నగరంలో ఘటన

ఖలీల్‌వాడి: చీటీ వ్యాపారం చేస్తున్న నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని హబీబ్‌నగర్‌ కాలనీకి చెందిన మహిళ ఇంటిపై ఆమె వద్ద చీటీ వేసిన కొందరు నాలుగు రోజుల క్రితం దాడి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. డబ్బులను ఈనెల 15న చెల్లిస్తానని సదరు మహిళ చీటీ వేసిన వారికి తెలిపింది. అయితే, చీటీ నడిపిన మహిళ నాలుగు రోజుల క్రితం తన కూతురు ఎంగేజ్‌మెంట్‌ చేస్తున్న విషయం తెలుసుకున్న వారు డబ్బులు ఎప్పుడు ఇస్తావని నిలదీసి దాడికి యత్నించారు. ఆ సమయంలో గొడవను వీడియోతీస్తున్న బాలికపై చీటీ వేసినవారు దాడి చేశారు. బాధితులు వెంటనే డయల్‌ 100కు కాల్‌ చేయడంతో ఘటనాస్థలానికి పోలీసులు చేరుకుని చీటీ వేసిన వారికి డబ్బులు ఇచ్చేయాలని చెప్పారు. కొన్ని రోజుల క్రితం ఇదే పోలీస్‌స్టేషన్‌లో అప్పు కేసుకు సంబంధించి భార్యాభర్తలను చితకబాదిన ఘటన చోటుచేసుకుంది.